నేడు 'జగనన్న ఆణిముత్యాలు'

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్డులోని సి కన్వెన్షన్ హల్ లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్లకు ప్రతిభా అవార్డులను ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



మొద్దునిద్రలో వ్యవసాయశాఖ

- విచ్చలవిడిగా నిషేధిత పురుగుమందుల విక్రయం
- జోరుగా సాగుతున్న నకిలీ విత్తనాల వ్యాపారం
- అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో వ్యవసాయశాఖ మొద్దునిద్రలో ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిషేధిత పురుగుమందులు వాడకూడదని ఒకవైపు రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు మరోవైపు జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకున్న పాపన లేదు. వ్యవసాయశాఖ అధికారుల ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రభుత్వం నిషేధించిన గడ్డి నివారణ, పురుగు మందులు జిల్లాలోని బహిరంగంగానే విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో పాటు నకిలీ విత్తనాల విక్రయం కూడా జిల్లాలో కొనసాగుతుంది. ఎక్కువగా కూరగాయలు, పత్తి, మొక్కజొన్న విత్తనాల్లో ఎక్కువగా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారు. ఈ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో చాలా చోట్ల ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. రైతులు తాము కొన్న ఎరువులు, పురుగుమందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఎవరైనా బిల్లులు అడిగితే వారిచ్చే బిల్లులకు, రైతులు చెల్లించే సొమ్ముకు పొంతన కుదరడం లేదు. ఇటువంటి విషయాలపై బాధిత రైతులు సంబంధిత మండల వ్యవసాయ అధికారులను సంప్రదించినా ఫలితం ఉండడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడానికి వస్తున్నారన్న ముందుస్తు సమాచారం రావడంతో వ్యాపారులు ఆ రోజున షాపులు మూసివేస్తున్నారు. దీంతో నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగు మందులు గుర్తింపునకు సాధ్యపడకుండా ప్రైవేట్ వ్యాపారులు తప్పించుకుంటున్నారు. ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సుమారు మూడు లక్షల 20 వేల ఎకరాల సాగు భూమి ఉండగా, ఖరీఫ్‌కు లక్షా 70 వేల ఎకరాలు వరి ప్రధానంగా పండించే మన్యంపై వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే మన్యంలో మనుగడ సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్‌ను వివరణ కోరగా, నష్టపోయిన రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వారు కొనుగోలు చేసిన పురుగుమందులకు, విత్తనాలకు బిల్లులు తీసుకోవాలని సూచించారు. సర్టిఫై డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు.

ఐదు సంసద్ ఆదర్శ్ గ్రామాలు ఎంపిక

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి మాధవి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమం కింద జిల్లాలో ఐదు గ్రామాలను దత్తత గ్రామాలుగా తీసుకున్నట్టు అరకు ఎంపి గొడ్డేటి మాధవి తెలిపారు. సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు గ్రామాలు దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆమె అన్నారు. గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. గ్రామాల్లో పిల్లలంతా బడిలో ఉండడం, యువతకు మంచి అవకాశాలు కల్పించడం తదితర కార్యక్రమాలను చేపట్టడంలో ముందుండాలని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలపై నిశిత దృష్టి సారించింది పథకాలు వినియోగించుకోవడం ద్వారా లక్ష్యాలు సాధించగలమని అన్నారు. మంచి సంకల్పం ఉంటే గ్రామాభివృద్ధి వస్తుందన్నారు. జూన్ 25 నాటికి గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని ఆయన ఆదేశించారు. జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్ కార్యక్రమం వివరాలు తెలిపారు. గ్రామాల్లో వ్యక్తిగత ప్రవర్తన - పరిశుభ్రత, మద్యపానం, ధూమ పానం నిషేదం, ఆరోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టడం, మానవ అభివృద్ధి - విద్యా, వైద్యం, పౌష్టిక ఆహారం పొందడం, ఆర్థిక, పర్యావరణ, సామాజిక అభివద్ధి., సుపరిపాలన, ప్రాథమిక సౌకర్యాలు, సేవలు కల్పన రంగాల్లో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. దరణయి (బీహార్), పేవిహిర్, బాఘువర్ (మధ్య ప్రదేశ్), హైవరే బజార్ (మహారాష్ట్ర), ఓడంతురై (తమిళనాడు), ఖోనోమ, చిజమి (నాగాలాండ్), గంగదేవిపల్లి (ఆంధ్ర ప్రదేశ్), కొక్రెబెల్లూర్ (కర్ణాటక), పున్సారి (గుజరాత్), రామచంద్రపూర్ (తెలంగాణ), మేలున్నింగ్ (మేఘాలయ), పిప్లంత్రి (రాజస్థాన్), ఎరవిపెరూర్ (కేరళ), శికడ్మాఖ (అస్సాం) వివిధ అంశాల్లో దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఆయన తెలిపారు.

జిల్లాలో నర్సిపురం (పార్వతీపురం), నీలకంఠాపురం (కురుపాం), కన్నపుదొర వలస (జియ్యమ్మవలస), ఇసుకగెడ్డ (సీతంపేట), పాచిపెంట (పాచిపెంట) గ్రామాలను సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కార్యక్రమం కింద గుర్తించారు. ఈ గ్రామాలకు ఛార్జ్ అధికారులుగా డ్వామా పీడీ కె.రామచంద్ర రావు (నర్సిపురం), డిపిఒ బి.సత్యనారాయణ (నీలకంఠాపురం), డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ (కన్నపుదొర వలస), ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఓ.ప్రభాకర రావు (ఇసుకగెడ్డ), జెడ్‌పి డిప్యూటీ సిఇఒ (పాచిపెంట)ను నియమించారు. సమావేశంలో డిఎఫ్ఒ జివిపి ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.జగన్నాథరావు, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, సంబంధిత గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

విద్యుత్తు బిల్లులతో జనానికి షాక్

ఛార్జీల పెంపును ప్రతిఘటించాలి : సిపిఎం

18న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలకు షాక్ ఇచ్చారని, ఈ పెంపును గత విద్యుత్ ఉద్యమస్ఫూర్తితో ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు ఇప్పటి వరకూ రెండేళ్లకో, మూడేళ్లకో పెంచేవారని, కానీ మోడీ ఆదేశాలకు లొంగిపోయిన ముఖ్యమంత్రి జగన్ ప్రతినెలా వంటగ్యాస్ లాగే కరెంటు ఛార్జీలు పెంచడానికి ఆదేశాలు ఇచ్చారు. కరెంటు బిల్లు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు,సర్‌ఛార్జీలు, విద్యుత్ సుంకం, గతంలో కాల్చిన విద్యుత్తు సర్దుబాటు చార్జీలు పేర్లు పెట్టి జగన్ ప్రభుత్వం, విద్యుత్ సంస్థ జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయన్నారు. అసలు ఛార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయని, ఈ నెల నుంచి అన్ని బిల్లుల్లో 10 శాతం నుంచి 50శాతం వరకు సర్దుబాటు చార్జీలు భారం పడిందని అన్నారు. జగన్ ప్రభుత్వం సామాన్యులు నడ్డి విరుస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంపుదలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంపై చర్చించడానికి ఈనెల 18న అన్ని సంఘాలు, వామపక్షాలతో స్థానిక సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, దీనిలో అందరూ పాల్గొని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, గొర్లి వెంకటరమణ, రెడ్డి లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

24 నుంచి జగనన్న సురక్ష

ప్రతి ఇంటికీ వెళ్లాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రతి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. సమస్యలను సంబంధిత పోర్టరులో నమోదు చేయాలని, వాటిపై విచారణ నిర్వహించి, గ్రామంలో పర్యటించే మండల టీం ద్వారా సదరు సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, జనన, మరణ, ఫ్యామిలీ మెంబరు, వివాహ ధ్రువపత్రాలు, మ్యుటేషన్లు తదితర సమస్యలుంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ల జారీ, మ్యుటేషన్లు చేయునప్పుడు నిబంధనలు పాటించాలని తెలిపారు. మండల, గ్రామ స్థాయిలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు ముందుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి మండలానికి రెండు మండల టీంలను ఏర్పాటు చేయాలని, ఒక టీంలో తహశీల్దారు, ఇఒపిఆర్‌డి, ఇతర సిబ్బంది ఉంటారని, మరొక టీంలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దారు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనరు, డిప్యూటీ తహశీల్దారు, సిబ్బంది ఉంటారని తెలిపారు. ముందుగా అన్ని గ్రామాల్లోకి వెళ్లేలా షెడ్యూలు రూపొందించు కోవాలని, దాని ప్రకారం మూడురోజులు ముందుగా ఆయా గ్రామాల్లో సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సర్వీసు పోర్టలు నందు రిజిస్ట్రేషను చేసి, విచారణ అనంతరం మండల టీం చే సర్టిఫికెడుల జారీ, సమస్యల పరిష్కారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 23న ప్రారంభిస్తున్నారని, 24న జిల్లాలో ప్రారంభమవుతుందని తెలిపారు. కావున దీని ప్రకారం షెడ్యూలు తయారుచేసి 24న మండల టీంలు పర్యటించేలా గ్రామాల్లో మూడు రోజుల ముందు నుంచి కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని టీం సందర్శించాలని, జిల్లా నుండి ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తాయని, గ్రామ బృందాలు ఏ ఇంటినైనా సందర్శించలేదని తమ దృష్టికి వస్తే సదరు గ్రామ సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెసి ఆర్.గోవిందరావు, సబ్ కలెక్టరు నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, తహశీల్దార్లు, ఎంపిడిలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

బొద్దిడిలో 25 మందికి అతిసార

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని జర్న పంచాయతీ బొద్దిడిలో 25 మంది గిరిజనులు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చేరారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన వివాహ వేడుకల్లో భోజనాలు చేసిన వీరికి శుక్రవారం ఉదయం నుంచి వాంతులయ్యాయి. దీన్ని గమనించిన గ్రామస్తులు వైద్యం కోసం దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. 20మంది పరిస్థితి మెరుగుపడిందని, ఐదుగుర్ని కురుపాం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వైద్యాధికారి బివిఎస్ స్వాతి తెలిపారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

ఓటరు జాబితా పక్కాగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఓటరు జాబితా అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఓటరు నమోదు అధికారులతో శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలు ఆరోపణలకు తావు ఉండరాదన్నారు. ప్రతి విషయాన్ని పక్కాగా పరిశీలించి ఆరోగ్యవంతమైన జాబితాను తయారు చేయాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా తయారులో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జెండర్, జనాభా తదితర అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో జెసి ఆర్. గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి.విష్ణుచరణ్, కల్పనా కుమారి, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకట రావు, ఆర్‌డిఒ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

10న కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

జులై 10న అంగన్వాడీ హెల్పర్లు టీచర్లు కోర్కెల దినోత్సవం సందర్భంగా పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పాలకొండ ప్రాజెక్ట్ అధ్యక్షులు జి.జెస్సీభాయ్, జి.మణికుమారి, పి.శ్రీదేవి. ఆర్.భవాని తదితరులు మాట్లాడుతూ అంగన్వాడీలకు అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులాపాలని, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, లబ్ధిదారులుగాను నాణ్యమైన ఆహారాన్ని సప్లై చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాలిటీ పెంచాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరుతూ జులై 10న కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. కావున అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు అందరూ ఈ నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలకొండ ప్రాజెక్టు పనిచేయుచున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్‌సిడి సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎన్‌సిడి సర్వేపై అవగాహన పెంచుకొని సచివాల పరిధిలోని గహస్తులకు ప్రధానమంత్రి బీమా రక్షణ కల్పించాలని బందులుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వెంకంపేట సచివాలయంలో ఆరోగ్య ,సంక్షేమ, రెవెన్యూ పోలీస్ సహాయకులకు వెలుగు ఏపీఓ పువ్వల సురేష్ కుమార్‌తో కలిసి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బూరుగలో దాహం కేకలు

- ఎండల తీవ్రతతో అడుగంటిన బావి
- గుక్కెడి నీటి కోసం పరుగులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మీ గ్రామాలకు అది చేస్తాం... ఇది చేస్తాం... అని పాలకులు హామీలకే పరిమితమవుతున్నారు తప్ప కనీసం మంచినీటి సౌకర్యం కల్పించడంలో విఫలమయ్యారని చెప్పక తప్పదు. మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధి బూరుగలో సుమారు 129 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందులో భాగంగా సుమారు 70 దళిత కుటుంబాలు నేల బావులపైనే తాగునీటికి ఆధారపడి కాలం గడుపుతున్నాయి. ఎండల తీవ్రత వల్ల గ్రామంలో ఉన్న బావి అడుగంటి పోవడంతో గొంతును తడుపుకునేందుకు గుక్కెడి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నట్లు గ్రామానికి చెందిన మహిళలు కె.వెంకటమ్మ, జి.వెంకటలక్ష్మి, బేరి లక్ష్మి, గౌరు, కురమాన సన్నమ్మ, గొల్లపల్లి పుష్పమ్మ, అల్లిన వీరయ్య, కె.శ్రీను, తవిటయ్య, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. బావులు ఎండిపోవడం, ఉన్న బోరు ద్వారా తాగేందుకు నీర రాకపోవడంతో సమీపంలో కూరగాయలు పండించే పంట పొలాల వద్ద గల మోటార్ వద్దకు నీటి కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలైనా, రాత్రి అయినా మోటర్ ద్వారా నీరు పొలాలకు విడిచిపెట్టినప్పుడు అక్కడికి వెళ్లి నీరు పట్టుకొని తీసుకొచ్చి దాహార్తిని తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తాగునీటి కోసం అంతా ఒకేసారి అక్కడికి పరుగులు తీయడంతో కూరగాయల రైతులు కూడా నీళ్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారన్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచనిస్థితి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావి పూర్తిస్థాయిలో అడుగంటిపోయినప్పటికీ గంటల తరబడి బావి వద్ద కాపలా కాచి వచ్చే అరకొర నీరు తోడుకొని దాహార్తిని తీర్చుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. తాగునీటి సమస్యపై గతేడాది అక్టోబర్ 21న గ్రామంలో జరిగే రైతు సదస్సుకు విచ్చేసిన సబ్‌కలెక్టర్‌కు దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు. అలాగే ఇటీవల స్థానిక ఎంపిపి డి.వెంకట రమణ నాయుడు వద్ద తమ గోడును వినిపించినప్పటికీ ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు లేక నిరుపయోగంగా ఉన్న బావి

రక్షిత పథకం ఏర్పాటు చేయాలి

ప్రతి ఏటా వేసవి వచ్చిందంటే నీటి కోసం తమ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కావున గ్రామంలోని సోలార్ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్టిక్కర్ సిఎం జగన్

కేంద్రం సొమ్ముతో రాష్ట్రంలో సోకులు : బిజెపి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

రాష్ట్రంలో పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్ సిఎం అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్‌రాజు ఎద్దేవా చేశారు. పాలకొండలో శుక్రవారం మహాజన సంపర్క్ అభిమాన్ కార్యక్రమానికి విష్ణుకుమార్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వం పేదలందరికీ రూ.లక్షా50 వేలు రుణంతో ఇళ్లను మంజూరు చేస్తే వాటికి జగన్ పేరు పెట్టుకొని స్టిక్కర్లు అంటించుకున్నారని విమర్శించారు. అలాగే కరోనా సమయంలో ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా ఉచిత బియ్యం అందిస్తుంటే దానికి కూడా జగన్ పేరు పెట్టుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతుందని దుయ్యబట్టారు. లిక్కర్ విషయంలో కూడా ప్రజల నుంచి వచ్చిన డబ్బు జగన్ జేబులోకి వెళ్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా మద్యపాన నిషేధం అని చెప్పి ఇప్పుడు లిక్కర్ ఆదాయంపైనే ఆధారపడి పాలన సాగిస్తున్నారన్నారు. చెత్తపైన పన్ను వేసే చెత్త ముఖ్యమంత్రి మన రాష్ట్రంలోనే ఉన్నారన్నారు. సొంత చిన్నానను హత్య చేసి గుండెపోటుగా కేసును మాఫీ చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయని అన్నారు. రాజకీయ కక్షతోనే పరిశ్రమలను మూత వేయిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

డిడిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్రీకాకుళం జిల్లా మందస ఎటిడబ్ల్యుఒ ఎం.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఉత్తర్వులను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శుక్రవారం శ్రీనివాసరావుకు అందజేశారు. గిరిజన సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె డిడికి సూచించారు. ప్రస్తుత డిడి నగేష్ మెడికల్ సెలవులో ఉన్నందున శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పిఒ తెలిపారు.

పిఒ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డిడి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి : పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీ పరిధిలో గల గుమడాంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన గుమడాం లే అవుట్ ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత సమయంలో పూర్తి కావాలని స్పష్టం చేశారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, పనులకు ఆటంకం కలుగుతుందని, కావున సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన అన్నారు. లబ్దిదారులకు ఎప్పటికప్పుడు ప్రేరణ కల్పించాలని ఆయన ఆదేశించారు. సాలూరు మునిసిపాలిటీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు తనిఖీ చేసిన పిఒ నిర్దేశిత కంపోనెంట్స్ విధిగా ఉండాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో ఎటువంటి అజాగ్రత్త ఉండరాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హెచ్. శంకర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమడాం లేఅవుట్‌లో పునాదులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి
www.prajasakti.com

స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

మొదటి విడత భూరీ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషను పనులను పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం కలెక్టరు కార్యాలయం నుంచి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రీసర్వే, ఎన్‌సిడి సర్వే, రిజిస్ట్రేషన్లు, ఇ-క్రాప్ బుకింగు, విత్తనాలు పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వే పనులను పూర్తిచేసేందుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసిందని, దాని ప్రకారం అక్టోబరు నాటికి పనులు పూర్తిచేయాలని తెలిపారు. మొదటి విడత పూర్తయిన గ్రామాల్లో ఈనెల 25 నుంచి రిజిస్ట్రేషన్లు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్‌సిడి సర్వే త్వరగా పూర్తిచేయాలని, సర్వే ఎంతవరకు జరిగినది నివేదిక అందజేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ని ఆదేశించారు. జెసి ఆర్.గోవిందరావు మాట్లాడుతూ జూలై మొదటి తేది నుండి ఇ-క్రాప్ బుకింగు మొదలు పెట్టాలని, సెప్టెంబరు మొదటి తేదీ నాటికి పూర్తిచేయాలని తెలిపారు. రాగి, కందుల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ పూర్తిచేయాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిన చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకట్రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాధరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె. రాజ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎండలకు నిర్మానుష్యమైన పట్టణ ప్రధాన రహదారి

వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి
నిర్మానుష్యంగా రహదారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవ్వడంతో పాటు వడగాల్పులు కూడా వీచడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పట్టణంలోని ఉదయం 7 గంటల నుంచి ఎండ వేడిమి ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల అయ్యేసరికి మరింత ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడడంతో పట్టణ ప్రధాన రహదారి కూడళ్లతో పాటు పలు వీధులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా రహదారులన్నీ వేడిక్కి పోవడంతో సాయంత్రం 6.30 గంటల వరకు రహదారులపై వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఈ ఉష్ణోగ్రతలు ఇంకెన్ని రోజులు ఉంటాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ఆత్మవిశ్వాసంతో చదివితే రాణింపు

ప్రజాశక్తి - కురుపాం

ఆత్మవిశ్వాసంతో చదివే విద్యార్థులు తప్పకుండా భవిష్యత్తులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోగలరని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ధృఢ సంకల్పం ఆత్మవిశ్వాసంతో చదివితే తప్పకుండా ఉన్నత స్థానాలకు చేరుకోగలరని అన్నారు. కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రానున్న పదో తరగతి ఫలితాలకు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలంటే ఉపాధ్యాయులు ఇప్పటి నుండే ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని ప్రణాళికా బద్ధంగా చదివేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఇఒల సమావేశంలో మాట్లాడుతున్న ఎఇ నాగేశ్వరరావు

భూమికి బలం పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - కురుపాం

భూమి తల్లికి బలాన్ని ఇవ్వడానికి పచ్చి రొట్టె విత్తనాలు ఎంతో దోహదపడతాయని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలో కిచ్చాడ రైతు భరోసా కేంద్రం వద్ద ఎఇఒల ఆధ్వర్యంలో రైతులకు పచ్చి రొట్టి విత్తనాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియల వల్ల భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయన్నారు. దీనివల్ల నత్రజని ఎరువుల వినియోగాన్ని 25-30 శాతం వరకు తగ్గించవచ్చని, నేల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు నేల కోతను అరికట్టి తెగుళ్లను తట్టుకునేలా పైరుకు శక్తినిస్తుందన్నారు. కావున రైతులంతా పచ్చిరొట్టె విత్తనాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

చినబగ్గలో పల్లెబాట

ప్రజాశక్తి - సీతంపేట

జనసేన మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చినబగ్గలో శుక్రవారం పల్లెబాట కార్యక్రమంలో జరిగింది. ఆ గ్రామంలోని ప్రజలతో జనసేన నాయకులు కూరంగి నాగేశ్వరరావు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాల్ని, ఆశయాలను, పవన్ కల్యాణ్ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే జనసేన దృష్టికి తీసుకొస్తే తమ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గర్భాన సత్తిబాబు, కూరంగి నాగేశ్వరరావు, మండలం అధ్యక్షులు మండంగి విశ్వనాథం, వి.కైలాసరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తారు తయారీ ఆపాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో కొంకుడువరం వద్ద ఏర్పాటు చేస్తున్న తారు తాయారీ ఫాక్టరీ పనులను వెంటనే నిలిపివేయాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. ఈ విషయమై కొంకుడువరం, చినగుడబా, పెద్దగుడబ, గదభవలస గ్రామస్తులతో కలిసి శుక్రవారం ధర్నా చేశారు. ఈ ఫ్యాక్టరీ ఆపకపోతే సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ఈనెల 19న ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంగధర్, గార గౌరీ శంకర్, గణేష్, కర్రి మణికంత, కొంకుడువరం సర్పంచి అప్పలనాయుడు, చినగుడబ, పెద్దగుడబ, గదబవలస గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న గ్రామస్తులు

అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా కురుపాం నియోజకవర్గం సంబంధించి స్థానిక గవ్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 10 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రోజు జరిగిన ఈ జాబు మేళాకు సుమారు 286 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 69 మంది వివిధ కంపెనీలో ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జాబ్‌మేళా నిర్వహించడం సంతోషదాకమన్నారు. యువత తమ ప్రతిభను కనబర్చి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ హరికష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలు... తప్పని తిప్పలు

ప్రజాశక్తి-పాలకొండ

ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉక్కపోత విపరీతంగా ఉంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే పాలకొండలో మాత్రం విద్యుత్ సమస్యలు ఎక్కువుగా ఉన్నాయి. అడుగడుగునా సాంకేతిక సమస్యలతో ప్రజలకు కష్టాలు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక కారణాలతో విద్యుత్ నిలిపి వేచేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఉంది. మొగిలివీధి, మేదరవీధి తదితర ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉంది. రాత్రి 10 గంటల తరువాత విద్యుత్ సరఫరాలో నాణ్యత లేకపోవడం తో ఫ్యాన్లు తిరగక ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. దీనిని పట్టించుకో వాల్సిన విద్యుత్ శాఖాధికారులు కనీసం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు విని పిస్తున్నాయి. ఇదిలా ఉండగా తంపటా పల్లిలో కూడా లోఓల్టేజీ సమస్య కొంత కాలంగా ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పందిరి మామిడివలస బస్‌స్టాప్ వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగే పరిస్థితిలో ఉంది. గత కొద్దిరోజులుగా ఈ స్తంభం ఇదే పరిస్థితిలో ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదు. గత నెలలో వీచిన పెనుగాలులకు స్తంభం వాలి పోయింది. నిత్యం వాహనాల రాకపోకలతో ఉండే ఈ రహదారిలో విద్యుత్ స్తంభం నేలకొరిగితే వైర్లు తగిలి షాక్ గురయ్యే అవకాశం ఉంది. రానున్న వర్షాకాలంలో భారీవర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం పడిపోయే అవకాశం ఉంది. అధికారులు వెంటనే వాలిపోయి ఉన్న విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైపునకు ఒంగినపోయిన విద్యుత్ స్తంభం

ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు
ఆశయంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థి దశలోనే విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు గొప్ప ఆశయంతోనే ముందుకు సాగాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌కె జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పూడి రామకష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించడం విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణలా వారి జీవితాంతం నిలుస్తుందని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే వారి భవిష్యత్ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి ఉన్నత ఆశయంతో ముందుకు సాగుతారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులను అసాధారణంగా తీర్చిదిద్ది ఈ పోటీ ప్రపంచంలో నిదొక్కుకునేలా వారిని ప్రోత్సహించి కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు రణభేరి చిన్నం నాయుడు, రణభేరి శివకుమార్, వైసీపీ సీనియర్ నాయకులు వి. గురురాజు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు బడులు

ప్రజాశక్తి - పాలకొండ

నాడు- నిధులతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నట్టు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం నుంచి విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. జగన్న విద్యాదీవెన, మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు తీసుకువచ్చి విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు బ్యాగులు, బూట్లు, టై, బెల్టు అందిస్తున్నామన్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు చదువుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు ట్యాబులు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన పాడి హేమలత మాట్లాడుతూ తనకు ఈ స్థాయిని గుర్తింపును తీసుకువచ్చిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే దుస్సాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి భాను, కౌన్సిలర్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

నిరుపయోగంగా భవనం
కోట్లాది రూపాయలు వృథా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య భవనం వద్ద గల భవనం నిరుపయోగంగా పడి ఉంది. 2019లో రూ.2కోట్లు అంచనా వ్యయంతో బాలికల సమీకృత వసతి గృహం ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ ద్వారా నిర్మాణ పనులు చేపట్టారు. ఏళ్లు గడిచినా పనులు పూర్తికాలేదు. ఈ భవనం పనులు సుమారు 80 శాతం పూర్తి పూర్తయ్యాయి. మిగిలిన 20 శాతం గచ్చులు, కిటికీలు, వైరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం డిగ్రీ కళాశాలకు భవన సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహణ కొనసాగుతుంది. ఇక్కడ సరైన వసతి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ భవనం పనులు పూర్తిచేసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణ కోసం అందజేస్తే ఎంత ప్రయోజనం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నత స్థాయి విద్యాశాఖ అధికారులు స్పందించి నిరుపయోంగా పడి ఉన్న భవనాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న మహిళా సమైక్య భవనం

ఎఇఒల సమావేశంలో మాట్లాడుతున్న ఎఇ నాగేశ్వరరావు

హెల్త్ సర్వేను అందరూ చేయించుకోవాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం, రెల్ల, డుమ్మంగి ఆరోగ్య సబ్ సెంటర్లో ఉన్న ప్రజలు ఆరోగ్య సర్వేను తప్పకుండా చేయించుకోవాలని తాడికొండ పిహెచ్‌సి వైద్యులు ఎం.బుద్దేశ్వరరావు కోరారు. శుక్రవారం కేదారిపురం సబ్ సెంటర్ పరిధిలో ఆరోగ్య సర్వేను నిర్వహించి మాట్లాడారు. ఆయా సబ్ సెంటర్ల పరిధిలో ఉన్న ప్రజలు తమ ఆధార్ కార్డును తీసుకొచ్చి హెల్త్ సర్వేకు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ హెల్త్ సర్వేను చేయించి హెల్త్ కార్డులను ఉచితంగా జారీ చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ హెల్త్ సబ్ సెంటర్లకు వెళ్లి సర్వేను చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ పి.రాధాకష్ణ, ఎమ్మెల్‌హెచ్ పి సునీత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

పట్టణంలో అంధకారం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పాత బస్టాండ్ కూడలి నుండి బెలగాం అగ్రహారం వీధి కూడలి వరకు ప్రధాన రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు, బంధం వారి వీధి, ఫ్లైఓవర్ పై ఉన్న విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఇడి లైట్లు వెలగకపోవడంతో పట్టణంలో అంధకారం అలముకుంది. పట్టణ సుందరీకరణ లో భాగంగా సుమారు రూ.14 లక్షలతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ లైట్లను ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైట్లు ఎప్పటికప్పుడు మొరాయించడంతో కొన్నిచోట్ల వెలగని పరిస్థితి కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న సెంటర్ లైటింగ్ విద్యుత్ స్తంభానికి ఉన్న ఎల్‌ఈడీ లైట్లు వెలగని పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకో కుండా గాలికి వదిలిపెట్టారు. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఎల్‌ఇడి లైట్లు వెలిగించే ప్రక్రియను చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కానరాని చలివేంద్రాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

అధికారుల అలసత్వం వల్ల ఎక్కడా చలివేంద్రాలు కానరావడం లేదు. మండలంలో గత పది రోజులుగా భానుడు తన ప్రతాపని చూపడంతో ఎండ తీవ్రత తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధాన గ్రామ జంక్షన్ల వద్ద వీటిని ఏర్పాటు చేయకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఎండలో అధికంగా తిరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు, అధికారులు సూచన, సలహాలిస్తున్నారు తప్ప కనీసం చలివేంద్రాలు ఏర్పాటు చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన జంక్షన్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశాఖలో జరిగిన జి 20 సదస్సు విజయవంతమైన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 1నుంచి 15 వరకు భద్రగిరి ఆర్ ఐటిఐలో విద్యార్థులచే మొక్కలు నాటించడం, వ్యాసరచన, సదస్సులు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. జి 20 సదస్సు ఆవశ్యకతను వివరిస్తూ పోస్టర్ విడుదల చేసినట్లు తెలిపారు.

డిఇఒను కలిసిన ఎస్‌సి, ఎస్‌టి టిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్‌ను శుక్రవారం పార్వతీపురంలో ఆయన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ టిఎఫ్ నాయకులు కలిసి పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ టిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అన్ను వెంకటరావు, శైల రమేష్ బాబు, రవికుమార్, వి.భాస్కరరావు, ఎం ధనుంజయనాయుడు ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి : సంధ్యారాణి

ప్రజాశక్తి - పాచిపెంట

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు ఐక్యం కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండలంలోని పి.కోనవలసలో శుక్రవారం టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతం, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురించి చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టో అంశాలపై గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలకు, రైతులకు, నిరుద్యోగ యువతకు వివరించాలని తెలిపారు. వైసిపి ఓటమి భయంతో టిడిపి సానుభూతిపరుల ఓట్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం, ఒకే ఇంటి నెంబర్‌తో సంబంధం లేని వ్యక్తులను ఓటర్లుగా చేర్పించి పిరికిపందచర్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటువంటివి జరగకుండా క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జులు అప్రమత్తంగా ఉండి గృహతనిఖీలు, హౌస్ లోకేషన్ మ్యాపింగ్ బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముఖీ సూర్యనారాయణ, నాయకులు యుగంధర్, పల్లెడ వెంకటరమణ, కొరిపిల్లి సురేష్, చల్లా కనకారావు, ఎంపిటిసి సభ్యులు ఉమా, సత్యానారాయణ, మధ్యారావు, మెహెర్‌బాబా, కృష్ణమూర్తినాయుడు, అలజంజి సీతారాం, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలుకింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రేమజంట రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని నిమ్మలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నిమ్మలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద యువ జంట మృతదేహాలను శుక్రవారం ఉదయం గుర్తించారు. సమీపంలో బ్యాగులను గుర్తించి, అందులో ఆధార్ కార్డులను రైల్వే పోలీసులు పరిశీలించారు. వీరిది అరకు జిల్లా అనంతగిరి మండల వాసులుగా గుర్తించారు. నందుల చంద్రన్న (32)ది తాడిగూడ గ్రామం. సెంబి స్వాతి(17) ఆమిగడ్డవలస గ్రామంగా నిర్ధారించారు. వీరు రైలు కిందపడి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలియరాలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి మందలించిందని...

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణంలోని రెల్లి వీధికి చెందిన సిరిపురం రూప తన తల్లి మందలించిందని ఆతహత్యాయత్నానికి పాల్పడింది. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రూప చదువు మానేసి ఇంట్లో ఎలాంటి పని సహాయం చేయక, నిత్యం నిద్రపోతుందని తన తల్లి సుజాత మందలించింది. దీంతో మనస్తాపం చెందిన రూప శుక్రవారం ఉదయం ఇంట్లో ఉన్న చీమల మందు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్పందించిన కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ఆటో బోల్తా ;18 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తవలస

ఆటో బోల్తా పడి 18 మంది ఉపాధి హామీ కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని చీపురువలసలో చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం ప్రకారం... చీపురువలసకు చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం మిందివలస అప్పలరాజు చెరువులో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం పనులు ముగించుకుని ఆటోలో తిరిగొస్తుండగా బోల్తా పడింది. ఈ ఘటనలో 18 మందికి గాయాలయ్యాయి. అందులో రంది ఎరుకమ్మకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం తరలించారు. మిగిలిన క్షతగాత్రులు కొత్తవలసలోని సంజీవని హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. అనివిరెడ్డి దేవుడమ్మకు కాలర్ బోన్ ఫ్యాక్చర్ అయింది. రంది లక్ష్మికి రెండు చేతులు విరిగిపోయాయి, అనివిరెడ్డి ఎర్రయమ్మ, జె.రవణమ్మ, ఆర్.ఈశ్వరమ్మ, వి.గంగాభవాని, ఎ.కోటలక్ష్మి, ఎ.లక్ష్మికి బలమైన గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సర్పంచ్ ఎం.ఎర్రయ్య రామస్వామి.. ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

జెసిబి, ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెల్లాలో శుక్రవారం జెసిబితో అక్రమ మట్టి తవ్వకాలతో పాటు రవాణా చేస్తున్న ట్రాక్టర్లను మైనింగ్ ఏడి శ్రీనివాసరావు పట్టుకున్నారు. వీటిని సీజ్ చేసి వీరఘట్టం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది కూడా ఉన్నారు.